


# మొదటి ముద్దాయి

■ తిరుమూరు సుధాకర్ రెడ్డి

మృత్యువు అతని గుండెల మీద కూర్చొనుంది. శీతల హస్తాలతో అది అతని గొంతు నులుముతోంది.

అతన్ని రక్షించటం ఇక ఆ దేవుడి తరం కూడా కాదు.

అందుకే ఆ ధర్మాసుపత్రి డాక్టర్లు అతన్ని యమకింకరులకు వొదిలేసి చేతులు కడుక్కున్నారు. ఆ యమ కింకరులు రావటం ఆలస్యమైందేమో, అతని ప్రాణాలు పోలేక . పెనుగులాడుతున్నాయి. ఇంతలో ఓ భారీ ఆకారం ఆ గదిలో ప్రవేశించి అతని పక్కన తిష్ఠ వేసింది. అతను యమకింకరుడు కాదు. ప్రభుత్వ సేవకుడు. ఇంకా చెప్పాలంటే పోలీసు కింకరుడు.

"ఇదిగో మిస్టర్! మిమ్మల్నే! మీ మరణ వాఙ్మూలం రాసుకోవాలి కొంచెం చెప్తారా?" సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కమాలుద్దీన్ చావుబతుకుల్లో వున్న ఆ వ్యక్తి మొహం మీద మొహం పెట్టి అడిగాడు. అతను నీరసంగా కళ్ళు తెరిచి 'ఎందుకు' అన్నట్లు చూశాడు.

"మిమ్మల్ని కత్తితో పొడిచిన వ్యక్తిని ఖైదు చేశాం. మీరు స్టేట్‌మెంట్ గనక ఇస్తే అతనికి శిక్ష పడటం ఖాయం. ఊఁ త్వరగా చెప్పండి. రాసుకుంటాను."

సి.ఐ. కమాలుద్దీన్ తొందర చేశాడు. కాని మంచం మీద మనిషి చెప్పనని మొండికేశాడు. కమాలుద్దీన్ కలవరపడ్డాడు. ఇలాంటి అనుభవం అతనికి కొత్త. మొగుళ్ళు తన్ని తగలేస్తే చస్తూ చస్తూ అది స్వయంకృత మేనని, తమ మొగుళ్ళు ఏ పాపం ఎరగరని మరణ వాఙ్మూలం యిచ్చిన సాధ్వీమణులు చాలామందిని చూశాడతను- ముక్కూ మొహం తెలియని ఎవరో తనను పొడిచేసిపోతే తన శత్రువుల పేర్లన్నిటినీ ఏకరువు పెట్టి కేసుల్లో ఇరికించిన వ్యక్తుల్ని కూడా అతను ఎరిగున్నాడు. అంతెందుకు చాలామంది యిచ్చే మరణ వాఙ్మూలాలు పోలీసు కేసుల్లాగే తప్పుల తడకగా కసిగా వుంటాయి. మరి ఈ వ్యక్తి వ్యవహారం ఏమిటి ఇలా గుంది? స్టేట్‌మెంటే ఇవ్వనంటాడేమిటి?

"చూడండి బాబూ! మిమ్మల్ని పొడిచిన వ్యక్తి మీ ఫ్రెండే కావొచ్చు. కానీ చట్టం దృష్టిలో అతను నేరస్తుడే. పైగా అతను నేరం ఒప్పుకున్నాడు కూడా" చాలా సౌమ్యంగా చెప్పాడు కమాలుద్దీన్. ఆ మాటతో మంచంమీది వ్యక్తి మొహం పాలిపోయింది.

"ఏమిటి...అతను...ఒప్పుకున్నాడా?" సంధి ప్రేలాపనలా అతను మాటలు రాక గింజుకున్నాడు.

"అవునండీ! అతనే ఈ హత్యచేసినట్లు ఒప్పుకున్నాడు., అతను ప్రేమించిన అమ్మాయిని మీరు పెళ్ళి చేసుకొంటున్నారనే ఆక్రోశంతో క్షణికావేశంలో కత్తితో పొడిచినట్లు ఒప్పేసుకున్నాడు" కమాలుద్దీన్ సంబరంగా చెప్పాడు.

"అయితేనేం? అతను ఈ కేసులో మొదటి ముద్దాయి మాత్రమే" మంచంమీది పేషంట్ ఖండితంగా పలికాడు. కమాలుద్దీన్ తృళ్ళి పడ్డాడు.

"ఏమిటి? ఏమిటి మీ ఉద్దేశ్యం? మిమ్మల్ని ఇంకెవరూ పొడవలేదే? ఎందుకిలా కేసును తప్పుదోవ పట్టిస్తున్నారు?" కమాలుద్దీన్ కళ్ళెర్రజేశాడు.

కాని చావుకే భయపడని వ్యక్తి పోలీసుకు భయపడుతాడా? మంచంమీది మనిషి మందహాసం చేశాడు.

"నన్ను పొడిచింది నా స్నేహితుడే. అందుకే అతన్ని మొదటి ముద్దాయి అంటున్నాను. కాని నా చావుకు నిజంగా బాధ్యులు పోలీసులు, డాక్టర్లు! ఇదే నా మరణ వాఙ్మూలం. కావలిస్తే రాసుకోండి."

కమాలుద్దీన్ ఖంగుతిన్నాడు.

"పోలీసులు, డాక్టర్లు మిమ్మల్నేం చేశారు?" కోపం అణచుకొంటూ అడిగాడు.

"నేను కత్తిపోట్లకు గురయ్యాక రెండు గంటలసేపు స్పృహతప్పి రోడ్లో పడివున్నానట! పుణ్యాత్ములెవరో పోలీసులకు ఫోన్ చేస్తే అది మా పరిధికాదని వేరే స్టేషన్‌కి ఫోన్ చెయ్యమన్నారట! ఇలా అన్ని స్టేషన్లూ అయ్యాక చివరికి ఎస్.పి.గారు చెబితేకాని నన్ను రోడ్లోంచి తీయలేదట. తీరా తీసుకొచ్చి గవర్నమెంటు ఆస్పత్రిలో పడేస్తే, నైట్ డ్యూటీలో వుండవలసిన డాక్టర్ పర్మిషన్ మీద ఇంటికి వెళ్ళి సొంత క్లినిక్ చూసుకొంటున్నాడని తెలిసింది. నేను ఆస్పత్రి వరండాలోనే గాయాల్లోంచి రక్తం ధారలుగా కారుతూ గంటసేపు వుండిపోయానట. చివరికి ఆ డాక్టరుబాబు రానేవచ్చి చెయ్యవలసిందేదో చేశాడు. కానీ అప్పటికే పరిస్థితి చెయ్యి దాటిపోయింది. అందుకే అంటున్నాను నా ఫ్రెండు మొదటి ముద్దాయి మాత్రమేనని! కాదంటారా?"

ఆ మాటలతో కమాలుద్దీన్‌కి అతన్ని చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది. అతను కసిగా పిడికిలి బిగించాడు. కానీ అతనికి ఆ అవకాశం రాలేదు- మరణ వాఙ్మూలం యి[illegible] మరుక్షణమే మంచంమీది వ్యక్తి మరణించాడు. ■